సాక్షి అన్నమయ్య జిల్లా

శనివారం । 18 । మే । 2024



శరణమయ్యా.. బ్రహ్మయ్యా

బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి లక్షలాదిగా జనం తరలిరావడంతో మఠం ఆవరణంతా కిటకిటలాడింది. -10లో



విత్తన శుద్ధితో వేరుశనగ సంరక్షణ

చిరు జల్లులు రైతుల్లో ఆశలు నింపుతున్నాయి. ఈ నేపథ్యంలో వేరుశనగ పంట సాగు చేసే రైతులు కొన్ని మెలకువలు పాటించాలని నిపుణులు చెబుతున్నారు. -10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.220
రెండోరకం	రూ.110	రూ.178

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 683 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

రేపు జిల్లా టీ-20 క్రికెట్ జట్ల ఎంపిక

కేవీపల్లె: వచ్చే నెల గుంటూరులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి టీ-20 క్రికెట్ పోటీకు ఆదివారం జిల్లా జట్లను ఎంపిక చేయనున్నట్లు ఏపీ టీ20 క్రికెట్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అద్వైత్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం మండలంలోని గ్యారంపల్లె ఏపీ గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో అండర్ 16, అండర్ 19, సీనియర్స్ విభాగంలో జిల్లా జట్లను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఎంపిక పోటీలకు హాజరు కావాలని కోరారు. వివరాలకు 9701515415, 8309365583 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఏపీ ఈఏపీసెట్ పరిశీలన



ఏపీ ఈఏపీసెట్‌ను పరిశీలిస్తున్న వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ: ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ ఈఏపీసెట్)-2024 జరుగుతున్న పరీక్షా కేంద్రాలని యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ఆచార్య చింతా సుధాకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం ఆయన కడపలోని శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలోని పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తున్న కంప్యూటర్ బేస్డ్ పరీక్షలను పరిశీలించారు. విద్యార్థుల సౌకర్యాలు, పరీక్షలకు సంబంధించి సాంకేతిక పరమైన అంశాల గురించి నిర్వాహకులతో మాట్లాడారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: కడప రామాంజనేయపురంలోని ఆంధ్రప్రదేశ్ మైనారిటీ గురుకుల పాఠశాలలో 5,6,7,8 తరగతులలో మిగిలిన సీట్లలో ప్రవేశానికి ముస్లిం మైనారిటీ, దూదేకుల విద్యార్థులు నేరుగా పాఠశాలకు వచ్చి దరఖాస్తులు ఇవ్వాలని ప్రిన్సిపాల్ పెతకంశెట్టి సోమ సత్యశేఖర్ తెలిపారు. వివరాలకు 77801 79446, 9059500173 నెంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

క్రికెట్ ఎంపికలకు చక్కటి స్పందన



క్రికెట్ ఎంపికల్లో పాల్గొన్న క్రీడాకారిణులు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో శుక్రవారం జిల్లా స్థాయి మహిళల క్రికెట్ ఎంపికలు నిర్వహించారు. సీనియర్స్ విభాగం, అండర్-23, అండర్-19, అండర్-15 విభాగాల్లో నిర్వహించిన ఈ ఎంపికలకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 85 మంది క్రీడాకారిణులు విచ్చేశారు. ఈ ఎంపికలను క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రికెట్‌లో మహిళలకు చక్కటి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. క్రీడాకారిణులు బాగా సాధన చేసి జిల్లా జట్టుకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. అనంతరం బౌలింగ్, బ్యాటింగ్ విభాగాల్లో ఎంపికలు నిర్వహించారు. త్వరలో జిల్లాజట్టుకు ఎంపికయ్యే క్రీడాకారిణుల జాబితాను ప్రకటిస్తామని సీఏవైడీ ప్రతినిధులు పేర్కొన్నారు. మహిళల క్రికెట్ కోఆర్డినేటర్ కె. విష్ణుమోహన్‌రావు, ఏసీఏ సౌత్‌జోన్ హెడ్‌కోచ్ పి.మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు.

వన్యప్రాణులకు అమృత ధారలు!

శేషాచలం (బయోస్పెయిర్) అడవిలో.. పెనుశిల అభయారణ్యంలో నీటి వనరులు ఒట్టిపోయి తాగేందుకు చుక్క నీరుదొరకక మూగజీవాలు అడవిని వీడి జనావాసాల్లోకి వచ్చేస్తున్నాయి. కొన్ని ప్రమాదాలకు గుర్రై మృత్యువాతపడుతున్నాయి. మరికొన్ని వేటగాళ్ల ఉచ్చులో చిక్కుకుంటున్నాయి. దీంతో వన్యప్రాణుల దాహార్తిని తీర్చడంతో పాటు వేటగాళ్ల బారిన పడకుండా రక్షించేందుకు అటవీశాఖ చర్యలు చేపడుతోంది.

- మండుతున్న ఎండలతో అడుగంటుతున్న నీటి వనరులు
- నీటిని అందుబాటులోకి తెచ్చేందుకు ప్రత్యేక చర్యలు
- శేషాచలం, పెనుశిల అభయారణ్యంలో సాసర్ పిట్స్



సాసర్‌పిట్ వద్ద దాహార్తి తీర్చుకుంటున్న వన్యప్రాణులు

రాజంపేట: వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు అటవీశాఖ సన్నద్ధమవుతోంది. శేషాచలం కేంద్ర ప్రభుత్వం తో జీవవైవిధ్య అటవీ ప్రాంతం (బయోస్పెయిర్)గా గుర్తింపు పొందిన సంగతి తెలిసిందే. వేసవి కాలంలో నీటి కోసం వన్యప్రాణులు అటవీ పరిసర ప్రాంతాల్లోని జననివాసాల్లోకి వచ్చేవి. ఆ సమయంలో కుక్కలబారిన, రైలు, వాహనాలు ఢీకొని మృత్యువాత పడుతున్న ఘటనలు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో గత నాలుగేళ్లుగా వన్యప్రాణులు సంచరించే ప్రాంతాల్లో నీటి తొట్టెలను ఏర్పాటుచేసి వాటి దాహార్తి తీర్చేవిధంగా కృషిచేస్తున్నారు. ఈ చర్యలు విజయవంతం కావడంతో అటవీశాఖ ఈ ఏడాది కూడా వేసవి ప్రణాళికను రూపొందించారు.దాహార్తితో అలమటిస్తున్న వన్యప్రాణుల గొంతుతడిపేందుకు అన్ని చర్యలను ఉభయ జిల్లాలకు చెందిన అటవీశాఖలు చర్యలు తీసుకున్నాయి. ఆ దిశగా కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నాయి. ప్రకృతి బిడ్డలను అడవి దాటనీయకుండా ముందుస్తు చర్యలకు ఉపక్రమించారు. చెట్లకు సాల్ట్ లిక్స్‌ను ఏర్పాటుచేస్తున్నారు. వేసవికి వన్యప్రాణులు దాహార్తితో పాటు డీహైడ్రేషన్ కాకుండా ఉండేందుకు సాల్ట్ లిక్స్‌ను అందుబాటులో ఉంచనున్నారు.

- అన్నమయ్య జిల్లాలో శేషాచలం, పెనుశిల అభయారణ్యాలు ఉన్నాయి. 3.01 మిలియన్ల హెక్టార్లలో వైల్డ్‌లైఫ్ విస్తరించి ఉంది.రాజంపేట నియోజకవర్గం పరిధిలోకి లంకమల అభయారణ్యం ఉంది. అయితే ఇది వైఎస్సార్ జిల్లాలోకి వస్తుంది. అన్నమయ్య జిల్లాలో రాజంపేట, రైల్వేకోడూరు, బాలపల్లె, సానిపాయి, చిట్వేలి, రాయచోటి, పీలేరు, మదనపల్లె రేంజ్‌లు ఉన్నాయి. ఉభయ జిల్లాలో ఉన్న అభయారణ్యాలలో వన్యప్రాణులు నీటి కోసం అలమటిస్తున్నాయి. అవి ప్రమాదాలకు గురవుతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. శేషాచలం, లంకమల అభయారణ్యం, పెనుశిల అభయారణ్యాలలో వన్యప్రాణాలు దాహార్తి తీర్చేందుకు అటవీ సమీపంలోని పల్లెల వైపు చూస్తున్నాయి.

ఏయే జంతువులు..



నీటి కోసం అడవిలో నెమలి వెతుకులాట

అటవీ ప్రాంతంలో జింకలు, దుప్పిలు, కొండగొర్రెలు, అడవి బర్రెలు, అడవిపందులు, నెమళ్లు, చిరుతలు, పెద్దపులి, హనిబాడ్జర్, మనుబోతు, కణుజు, రోషకుక్కలు, తోడేళ్లు, నక్కలు, ఎలుగుబంట్లు, ఇతర జంతువులు, పక్షులు నీటి కోసం జనావాసాల వైపు అడుగులు వేస్తున్నాయి. సంచరించే ప్రాంతంలో నీటి వనరులు లేనప్పుడే ఈ పరిస్థితి ఏర్పడుతోంది.

పగలు కన్నా..రాత్రుల్లోనే నీటికోసం..

అటవీ ప్రాంతంలో ఉన్న వన్య ప్రాణులు పగలుకన్నా.. రాత్రి వేళలో గ్రామాల సమీపంలోని తోటల్లోకి వచ్చి నీటి కోసం పరుగులు తీయడం కనిపిస్తోందని ప్రత్యక్షంగా చూసిన రైతులు అంటున్నారు. వీటి వల్ల తోటలకు ఎటువంటి హానీ ఉండదని, ఏనుగులతో హానీ ఉంటుందని చెబుతున్నారు. తెల్లవారుజాము వరకు మైదాన ప్రాంతంలోనే దాహార్తీ తీర్చుకొని సేదతీరుతుంటాయని అంటున్నారు.



సాసర్‌పిట్‌ను నీటితో నింపుతున్న అటవీసిబ్బంది

శేషాచలంలో సహజవనరులు

శేషాచలంలో సహజ వనరులు ఉన్నాయి. వర్షాకాలంలో నీరు పుష్కలంగా ఉన్నప్పటికి, వేసవిలో అరకొరగా అయిన నీటి వనరులు అందుబాటులో ఉంటాయి. దట్టమైన అటవీ ప్రాంతంలోని పెద్దకోన, దొంగబండ, ఏనుగుల బావి, దొన, దిన్నెల లాంటి ప్రాంతాలు ఉన్నాయి. ఈ ప్రాంతానికి జంతువులు వెళ్లి తమ దాహార్తిని తీర్చుకుంటున్నాయి. పెనుశిల అభయారణ్యంలో కూడా సహజవనరులు ఉన్నట్లు అటవీ వర్గాలు భావిస్తున్నాయి. పది కుంటలు, ఆరుచెక్‌డ్యాంలు ఉన్నాయి. నీటి ఎద్దడి నివారణకు ఇవి దోహదపడతాయి. వేసవిలో దట్టమైన అటవీ ప్రాంతంలో నీటి సమస్య ఉత్పన్నమవుతోంది. ఫలితంగా కొన్నిచోట్ల వన్యప్రాణులు గ్రామాలవైపు పరుగులు పెడుతున్నాయి. ఈనేపథ్యంలో ప్రమాదాల బారినపడి, ప్రాణాలు కోల్పోతున్నాయి. మదనపల్లె పరిధిలో ఆరునెలల కిందట ఐదు కృష్ణజింకలు మృతిచెందాయి. తాజాగా నందలూరులోని నాగిరెడ్డిపల్లె శివార్లలో నీటికోసం దుప్పిలు వచ్చి మృత్యువాతపడ్డాయి. దీంతో అటవీశాఖ నీటి వనరులును కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



అభయారణ్యాలు: శేషాచలం,పెనుశిల

వైల్డ్‌లైఫ్: 3.1 మిలియన్ హెక్టార్లు

అటవీ విస్తీర్ణం: 2,57,000 హెక్టార్లు

సాసర్‌పిట్స్: 75

రేంజ్‌లు: 8

వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు చర్యలు



శేషాచలం, పెనుశిల అభయారణ్యంలో వన్యప్రాణుల సంరక్షణకు కృషిచేస్తున్నాము. నీటితొట్టెలను వన్యప్రాణులు సంచరించే ప్రదేశాల్లో ఏర్పాటుచేశాం. జిల్లా వ్యాప్తంగా సాసర్‌పిట్‌లను అందుబాటులోకి తెచ్చాం. వీలైనంతవరకు సాసర్‌పిట్‌లలో నీటిని నింపుతున్నాము. జంతువులకు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. **–తుమాటి నాగమణీశ్వరి, జిల్లా అటవీశాఖ అధికారి (సోషల్ ఫారెస్టు), రాయచోటి**

ఉపశమనం!

- ఇటీవల జిల్లాలో 44 డిగ్రీలకు ఫైగా నమోదైన ఉష్ణోగ్రతలు
- ఎండలు తగ్గడంతో ఊపిరి పీల్చుకున్న జనం
- వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక



రాయచోటిలో ఆకాశం మేఘావృతమైన దృశ్యం

సాక్షి రాయచోటి: వేసవి తాపంతో రగిలిపోయిన ప్రజలకు కాస్త ఉపశమనం కనిపించింది. ఫిబ్రవరి నుంచి సూర్యభగవానుడు ప్రచండ నిప్పుల ధాటికి విలవిల్లాడిపోయారు. ఈసారి 43–44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలతో జనం ఉక్కిరిబిక్కిరి అయ్యారు. అంతేకాకుండా సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కూడా రాజకీయ నాయకులు దాదాపు రెండు నెలలుగా మండుతున్న ఎండల్లోనూ ప్రచారాన్ని కొనసాగించారు. ఎండ దెబ్బతో బయటికి వెళ్లే పరిస్థితి లేకపోయినా తప్పని పరిస్థితులతో ప్రజల్లో తిరుగుతూ కనిపించారు. ఇంతటి ఉక్కపోత పరిస్థితుల నుంచి వాతావరణం మారడంతో చల్లదనం నింపుతూ వర్షం పలకరింపుతో ప్రజలు కాస్తంత సేద తీరుతున్నారు.అన్నమయ్య జిల్లాలో వారం రోజులుగా వాతావరణంలో మార్పులు కనిపిస్తున్నాయి. పోలింగ్‌కు రెండు రోజుల ముందునుంచి జిల్లాలో ఎక్కడో ఒకచోట గాలులతోపాటు వర్షం కురుస్తోంది. దానికితోడు నెలాఖరుకు రుతు పవనాలు ప్రవేశిస్తాయని వాతావరణశాఖ ప్రకటించడంతో జనాలకు ఉపశమనం కలిగించే అంశమని చెప్పవచ్చు.

నాలుగైదు రోజులపాటు వర్షాలు

జిల్లాలో నాలుగైదు రోజులపాటు వర్షాలు పడనున్నట్లు వాతావరణశాఖ తెలియజేసింది. ఇప్పటికే ఆకాశం మేఘావృతమై శుక్రవారం సాయంత్రం నుంచి జల్లులు పడుతున్నాయి. ఇవి క్రమక్రమంగా భారీ వర్షాలుగా మారే అవకాశం ఉంది. పిడుగులు కూడా పడే అవకాశం ఉందని హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

పోలింగ్‌తో తగ్గిన రాజకీయ వేడి

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రెండు నెలలుగా ఎర్రటి ఎండలో పోరాడిన రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తలకు పోలింగ్‌తో రాజకీయ వేడి చల్లారింది. మరోవైపు ఇదే పోలింగ్ సమయానికి సూర్యభగవానుడు శాంతించాడు. దీంతో అటు రాజకీయ వేడి...ఇటు భానుడి భగభగలు రెండూ ఒకే సమయానికి తగ్గిపోవడం విశేషం. పైగా అదే సమయంలోనూ వర్షాలు కూడా మొదలై చల్లని వాతావరణం కనిపిస్తుండడంతో అందరిలోనూ హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

పనుల్లో అలసత్వం కుదరదు!

పీబీసీ ఫైడనింగ్ కాంట్రాక్టర్‌కు నోటీసు

బి.కొత్తకోట: పుంగనూరు ఉపకాలువ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ అలసత్వంపై ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. సత్వరమే పనులు చేపట్టాలని, సంబంధిత పనుల ప్రతిపాదనలు సిద్ధం చేసి నివేదించాలని కోరుతూ హంద్రీనీవా ప్రాజెక్టు మదనపల్లె ఎస్ఈ సీఆర్.రాజగోపాల్ కాంట్రాక్టు సంస్థకు ఇటీవల నోటీసులు జారీ చేసిన విషయం శుక్రవారం తెలిసింది. అన్నమయ్య, చిత్తూరుజిల్లాల్లో సాగే ఏవీఆర్ హంద్రీనీవా సాగునీటి ప్రాజెక్టు రెండోదశలో అంతర్భాగమైన పుంగనూరు ఉపకాలువ విస్తరణ పనులకు ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించింది. అన్నమయ్యజిల్లా పి.టి.యం మండలం సీవీరామన్నగారిపల్లె నుంచి హంద్రీనీవా పుంగనూరు ఉపకాలువపై కిలోమీటర్ 79.600 నుంచి చిత్తూరుజిల్లా పలమనేరు నియోజకవర్గం పెద్దపంజాణి మండలంలో కిలోమీటర్ 220.350 వరకు కాలువను విస్తరించే పనులకు ప్రభుత్వం రూ.1,219,93,02,150 అంచనాతో టెండర్లను ఆహ్వానించింది. రెండు కంపెనీలు పోటీపడగా నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ ప్రభుత్వ అంచనా విలువకంటే 0.1997 శాతం తక్కువతో రూ.1,217,49,40,146.53తో టెండర్ దక్కించుకోగా ఒప్పందం జరిగింది. దీంతో కాంట్రాక్టు సంస్థ మదనపల్లె పట్టణ ప్రజలకు తాగునీటిని అందించే సమ్మర్ స్టోరేజీ ట్యాంకులైన చిప్పిలి, గుంటివారిపల్లె పనులు చేపట్టింది. ఇందులో చిప్పిలికి సంబంధించి రూ.10 కోట్ల విలువైన ప్రొటెక్షన్ బండ్, మొరవ తదితర పనులు చేసింది. గుంటివారిపల్లెకు సంబంధించి మొరవ పనులు చేయాల్సి ఉంది. అయితే పుంగనూరు ఉపకాలువ వెడల్పు పనులకు సంబంధించి పనులు మొదలవలేదు. దీంతో తక్షణమే పనులు చేపట్టాలని కోరుతూ ఎస్ఈ నోటీసులు ఇచ్చారు. ఇందులో ఒప్పందం మేరకు పనుల్లో పురోగతి సాధించాలని సూచించారు. పనులకు సంబంధించి ఇన్వేస్టిగేషన్, భూ సేకరణ, డిజైన్స్, డ్రాయింగ్‌లను సమర్పించాలని కోరారు. కృష్ణా జలాలను గండికోట రిజర్వాయర్ నుంచి తరలించాలంటే ఈ కాలువ వెడల్పు పనులు పూర్తి కావాల్సి వుంది. దీనిపై ఎస్ఈ రాజగోపాల్ మాట్లాడుతూ నోటీసులు జారీ చేసి పనులు చేపట్టాలని కోరినట్టు చెప్పారు.

19న ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే

రాయచోటి: ఎయిడ్స్ వ్యాధితో జీవితాలను కోల్పోయిన వారి జ్ఞాపకార్థం ఈనెల 19న అంతర్జాతీయ ఎయిడ్స్, క్యాండిల్ లైట్ మెమోరియల్ డే నిర్వహించనున్నట్లు జిల్లా కుష్ఠు, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ శైలజ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి ఏడాది డిసెంబర్ 1న అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవం జరుపుకోవడంతోపాటు మే నెల మూడో ఆదివారాన్ని అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డేగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో ఎయిడ్స్ వ్యాధి వల్ల కలిగే సామాజిక, ఆర్థిక నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 19న రాయచోటిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ప్రభుత్వ ఆసుపత్రి నుంచి డైట్ కళాశాల వరకు ప్రేమ, సంఘీభావంతో మనందరం గుర్తించుకుందాం, మనందరం నయం చేసుకుందాం అనే థీమ్‌తో ఈ కార్యక్రమంపై అవగాహన ర్యాలీ ఉంటుందన్నారు.

బాలుడి ఆచూకీ లభ్యం

బి.కొత్తకోట : స్థానిక పంజూరమ్మ గుడి వీధికి చెందిన వర్ధన్ (12) అచూకీ లభ్యమైంది. మతి స్థిమితం లేని వర్ధన్ తప్పిపోవడంతో కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విషయం సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో గురువారం రాత్రి బి.కొత్తకోటలో బాలుడిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు.

అనారోగ్యంతో యువకుడు ఆత్మహత్య

మదనపల్లె : అనారోగ్యంతో ఓ యువకుడు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మదనపల్లె మండలంలో జరిగింది. అనపగుట్టకు చెందిన లక్ష్మీనారాయణ, రమాదేవిల కుమారుడు టి.నరేష్(32)..పీటీఎం మండలం అంకిరెడ్డిపల్లెలో ఉన్న స్పిరిట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. కొద్దిరోజులుగా అనారోగ్యం బారిన పడి చికిత్స పొందుతున్నాడు. అయినా ఆరోగ్యం కుదుటపడకపోవడంతో ఇంట్లో తరచూ గొడవపడేవాడు. ఈ క్రమంలో గురువారం మదనపల్లె మండలం కొండామర్రిపల్లె సమీపంలోని గాయత్రి స్టోన్ క్రషర్స్ సమీపంలో గడ్డి మందు తాగి ఇంటికి చేరుకున్నాడు. ఇంటి వద్ద అపస్మారకస్థితికి చేరుకోగా, గమనించిన కుటుంబసభ్యులు వెంటనే స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం బాధితుడ్ని తిరుపతికి రెఫర్ చేశారు. తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలకు నరేష్ మృతిచెందాడు. మృతదేహానికి తిరుపతి రుయా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. తండ్రి లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు తాలూకా పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శేఖర్ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి


దుండగుల చేతిలో గాయపడిన అల్తాఫ్

వీరబల్లె(రాయచోటి టౌన్) : వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై గుర్తుతెలియని దుండగులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. స్థానికులు, బాధితుడి కథనం మేరకు..వీరబల్లె మండలం వంగిమళ్ల గ్రామం పెద్దూరుకు చెందిన షేక్ అల్తాఫ్ శుక్రవారం తెల్లవారు జామున (సుమారు 5 గంటల సమయంలో) ఇంటికి సమీపంలోని పొలం గట్ల వద్దకు బహిర్భూమికి వెళ్లాడు. అతడి కోసం మాటు వేసిన దుండగులు ముఖాలకు మాస్కులు ధరించి ఒక్కసారిగా కత్తులతో దాడి చేసి హతమార్చే ప్రయత్నం చేశారు. అదే సమయానికి అటు నుంచి ఆటో రావడంతో భయంతో పరారయ్యారు. అల్తాఫ్ ఎంతకూ ఇంటికి రాకపోవడంతో ఆయన భార్య కుమార్తె వెళ్లి చూడగా, రక్త గాయాలతో పడి ఉన్నాడు. స్థానికుల సాయంతో రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు రూరల్ సీఐ తులసీరాం కేసు నమోదు చేశారు.

శరణమయ్యా.. బ్రహ్మయ్యా


దీక్షబంధనాలంకారోత్సవంలో దర్శనమిస్తున్న స్వామి


మఠం ప్రాంగణంలో భక్తజనం

- వైభవంగా ఆరాధనోత్సవాలు
- పోటెత్తిన భక్తజనం
- మార్మోగిన 'బ్రహ్మ'నామస్మరణ

బ్రహ్మంగారిమఠం : 'మీ దరికి చేరామయ్యా.. మమ్మల్ని దీవించయ్యా..' 'శరణమయ్యా.. బ్రహ్మయ్యా'..అంటూ జగద్గురు మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి సమాధిని దర్శించుకుని భక్తజనం తరించారు. ఇంటింటా పండగను ఆనందంగా జరుపుకొన్నారు. క్రీ.శ.1693కు సరియగు శ్రీముఖ నామ సంవత్సరం వైశాఖ శుద్ధ దశమి నాడు సజీవ సమాధి నిష్ట పొందిన వీరబ్రహ్మేంద్రస్వామిని ఏటా కొలుస్తూ భక్తులు పర్వదినంగా జరుపుకొంటున్నారు. ఇందులో భాగంగా సజీవ సమాధి నిష్ట వహించిన ప్రాంతం బ్రహ్మంగారిమఠంలో ఆరాధన గురుపూజోత్సవాలు నాలుగు రోజుల నుంచి అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి లక్షలాదిగా జనం తరలిరావడంతో ఆవరణంతా కిటకిటలాడింది. క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు 'జై వీరబ్రహ్మ.. జై గోవిందమాంబ' నామస్మరణ చేశారు.

కమనీయం.. దీక్షాబంధనాలంకారోత్సవం

తెల్లవారుజామున గర్భాలయంలో మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి అర్చనా మూర్తులకు గంగ, పంచామృతం, క్షీరం, ఫలోదకాలతో అభిషేకించారు. అనంతరం ప్రత్యేక ప్రస్తాలంకరణ చేసి స్వామి గుణగణాలను కీర్తిస్తూ సహస్ర నామార్చన చేశారు. స్వామి యోగ నిద్రలో ఉన్న అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం దీక్షబంధనాలంకారోత్సవాన్ని (స్వామి సజీవ సమాధి నిష్ట వహించిన సందర్భాన్ని దీక్షలో దర్శించే అలంకరణ) కనుల పండువగా నిర్వహించారు. వాసుదేవపురానికి చెందిన ఇరగంరెడ్డి మూలింటి నాగిరెడ్డి, వెంకటమ్మ దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. సాయంత్రం వేదపారాయణం చేసి కాలజ్ఞానంలోని కొన్ని తత్వాలను ఆస్థాన పండితులు పెదపాటి నాగేశ్వరరావు వివరించారు.

వైభవం.. నందివాహనోత్సవం

రాత్రి భక్తుల కాలక్షేపం కోసం హరికథ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నందివాహన గ్రామోత్సవం ఉత్సాహ భరితంగా జరిగింది. మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి నంది వాహనంపై ఆశీనులను చేశారు. పెద్దమఠం నుంచి స్వామి నివశించిన ఇంటి వరకు చేర్చి.. అనంతరం కందిమల్లయ్య పల్లె పుర వీధుల్లో గ్రామోత్సవం చేపట్టారు. అనంతరం ఊరేగింపు తిరిగి పెద్దమఠం చేరుకుంది. ఉత్సవానికి కమలాపురం నియోజకవర్గం పెద్దపుత్తకు చెందిన తాడిగొట్ల వీరారెడ్డి, నారాయణరెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా దాతలు అన్నదానాలు, మజ్జిగ, వాటర్ ప్యాకెట్ల పంపిణీ విరివిగా చేపట్టారు. తిరుమల తిరుపతి దేవస్థానం సంగీత కళాశాల విద్యార్థులు త్యాగరాజ కీర్తనలు ఆలపించారు. వీరబ్రహ్మేంద్రస్వామిని స్థానిక ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తనయుడు ఎస్.అశోక్‌రెడ్డి, ఎంపీపీ వీరనారాయణరెడ్డితో పాటు నాయకులు దర్శించుకున్నారు పూర్వపు మఠాధిపతులు వీరభోగవసంత వెంకటేశ్వర స్వామి కుమారులు వెంకటాద్రిస్వామి, వీరభద్రయ్యస్వామి, వీరంబొట్లయ్యస్వామి, దత్తాత్రేయస్వామి, గోవిందస్వామి, వరదరాజస్వామి తదితరులు పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మఠం ఫిట్ పర్సన్ శంకర్‌బాలాజి, మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి, సిబ్బంది, స్వామి శిష్యులు ఏర్పాట్లు చేపట్టారు. పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

నేడు బ్రహ్మ రథోత్సవం

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజోత్సవాల్లో భాగంగా ఐదో రోజు శనివారం సాయంత్రం బ్రహ్మ రథోత్సవం నిర్వహించనున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఇందుకు తగిన ఏర్పాట్లు చేశారు.

భార్య మందలించిందని భర్త ఆత్మహత్య


మధు(ఫైల్)

రామసముద్రం : తాగుడుకు బానిసైన భర్తను.. భార్య మందలించడంతో విషపూరిత ద్రవం తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. పోలీసుల ప్రాథమిక వివరాల మేరకు.. రామసముద్రం మండలం ఎం.గొల్లపల్లికి చెందిన మధు(26) రామసముద్రంలో బంగారు నగలకు మెరుగులు దిద్దే పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మద్యం తాగే అలవాటు పడిన మధు ఈ నెల 14వ తేదీన మద్యం తాగి ఇంటికి వచ్చాడు. తాగుడు మానని భర్తను.. భార్య మందలించింది. మనస్తాపం చెందిన మధు 15వ తేదీన ఇంటి నుంచి బయటికి వచ్చి తిరిగి వెళ్లలేదు. దీంతో భర్త భార్య శ్వేత తన భర్త కనిపించడం లేదని ఈ నెల 16వ తేదీన స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. రామసముద్రం దారిలో మధు మృతదేహం పోలీసులు గుర్తించారు. విషం తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతోనే ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని గ్రామస్తులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి కోసం ఘర్షణ


చిన్నమండెం : మండలంలోని కొత్తపల్లి గ్రామంలో మల్లూరు క్రాస్ వద్ద శివారెడ్డి, చిన్నప్పలు తాగునీటి ట్యాంక్ వద్ద ఘర్షణ పడినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. ఆయన కథనం మేరకు ..శుక్రవారం ఉదయం శివారెడ్డి, చిన్నప్పలు తాగునీటి ట్యాంకర్ వద్ద నీళ్లు పట్టుకుంటూ ఘర్షణ పడ్డారు. ఈ క్రమంలో నీటి ట్యాంకర్ వద్ద గేట్ వాల్వ్ ఆపేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

భక్తి శ్రద్ధలతో సీతమ్మ జయంతి పూజలు


సీతమ్మ జయంతి ఉత్సవం చేస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట : ఏకశిలానగరిలో కొలువైన కోదండ రామాలయంలో శుక్రవారం సీతాదేవి జయంతి వేడుక ఘనంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలు, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. రంగమండపంలో భక్తి శ్రద్ధలతో అర్చకులు వీణారాఘవాచార్యులు, శ్రావణ్ కుమార్, వీణా మనోజ్ కుమార్ వారు విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, వేద పారాయణం పూజలు చేశారు. మల్లెలతో అర్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నటేష్ బాబు, వీజీవో బాల్‌రెడ్డి, బోర్డు సెల్ డిప్యూటీ ఈవో ప్రశాంతి, ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, నవీన్ కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ రాక


మోహన్ భగవత్

మదనపల్లె : రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ మధుకర్ భగవత్ శనివారం మదనపల్లెకు రానున్నారు. రూరల్ మండలం పోతబోలు పంచాయతీలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో జరగనున్న దక్షిణాది రాష్ట్రాల శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొంటారని తెలిసింది. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం బెంగళూరు నుంచి మదనపల్లెకు చేరుకుని, నేరుగా శిక్షణా శిబిరం వద్దకు వెళతారని, అక్కడే నాలుగురోజుల పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటకకు చెందిన ఆర్ఎస్ఎస్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తారని తెలిసింది. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ జెడ్ ప్లస్ కేటగిరీ భద్రతలో ఉన్న వ్యక్తి కావడంతో జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. భద్రతా ఏర్పాట్లలో స్థానిక పోలీసులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే ఆయన విడిదిచేసే పాఠశాల ప్రాంగణం, చుట్టుపక్కల తనిఖీలు నిర్వహించినట్లు తెలిసింది. డీఎస్పీ ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. పర్యటనపై మీడియాకు సమాచారం లేదు.

స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన

మూడంచెల భద్రత...
కేంద్ర బలగాల పహారాపై ఆరా


రాయచోటిలో స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, జేసీ, ఎస్పీలు

రాయచోటి : అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో భద్రపరిచిన ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌లను కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, ఎస్పీ బి.కృష్ణారావు, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ శుక్రవారం పరిశీలించారు. స్థానిక శ్రీసాయి ఇంజినీరింగ్ కళాశాలలో భద్రపరిచిన ఈవీఎంలను పరిశీలించడంతో పాటు అక్కడ ఏర్పాటైన భద్రతా వ్యవహారాలపై ఆరా తీశారు. రాజంపేట పార్లమెంట్, ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి పోలింగ్ బ్యాలెట్, కంట్రోల్ యూనిట్స్, వివి ప్యాట్స్‌ను జాగ్రత్తగా భద్రపరిచినట్లు కలెక్టర్ తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించి అక్కడ రిజిష్టర్‌లో కలెక్టర్, ఎస్పీలు సంతకాలు చేశారు. అనంతరం స్ట్రాంగ్ రూమ్‌లో భద్రతా, కౌంటింగ్ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సాయి ఇంజినీరింగ్ కాలేజ్ వద్ద మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. డీఎస్పీ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, మొబైల్ టీమ్, సీఆర్‌పీఎస్, ఆర్మ్డ్ రిజర్వ్ ఫోర్సెస్, రాష్ట్ర పోలీస్ యంత్రాంగం ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా ప్రజలు ఎలాంటి చట్ట ఉల్లంఘనలకు పాల్పడకుండా తమ వంతు సహకారం అందించాలని ఎస్పీ కోరారు.

పొట్టకూటికోసం వెళ్తూ.. ఒకరు మృతి


మృతి చెందిన బాష

రామాపురం : పొట్టకూటి కోసం వెళ్తూ మార్గమధ్యంలో ప్రాణాలు కోల్పోయిన సంఘటన మండలంలోని కర్ణపువాండ్లపల్లెలో శుక్రవారం చోటుచేసుకుంది. కర్ణపువాండ్లపల్లెకు చెందిన కడప బాషా(56) ప్రతి రోజూ చింత చిగురు అమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. రోజూ తెల్లవారుజామున బైక్‌పై చింత చిగురు తీసుకుని కడప మార్కెట్‌కు వెళ్లి విక్రయిస్తారు. ఈ నేపథ్యంలో మూలవంక పెట్రోల్ బంక్ వద్ద బైక్ నుంచి పడి తీవ్ర గాయాలయ్యాయి. కడప రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి మృతుడి కుటుంబీకులను పరామర్శించారు. అతడి భార్య కువైట్‌కు బ్రతుకుతెరువు కోసం వెళ్లిందని, భర్త మరణ వార్త తెలిసిన వెంటనే హుటాహుటిన బయలుదేరినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

అనుమానాస్పద స్థితిలో హిజ్రా మృతి

చిన్నమండెం : మండలంలోని కేశాపురం జామాయిలచెట్ల వద్ద అనుమానాస్పదంగా గణేష్(హిజ్రా) మృతి చెందినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. ఎస్సై వివరాల మేరకు.. రాయచోటి–మదనపల్లె జాతీయ రహదారిలో కేశాపురం గ్రామ పంచాయతీ ఆంజనేయస్వామి గుడి వెనుక గల జామాయిల్ చెట్ల వద్ద గణేష్(హిజ్రా) మృతదేహం గుర్తించిన స్థానికులు అటవీ, పోలీసు అధికారులకు సమాచారం అందించారన్నారు. గుర్రంకొండ మండలం నడిమి కండ్రికకు చెందిన గణేష్(హిజ్రా)గా గుర్తించి వారి కుటుంబసభ్యులకు సమాచారం అందజేశారన్నారు. ఈ మేరకు మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉపాధి కూలీ..

సుండుపల్లె(రాజంపేట) : మండలంలోని రాయవరం దిగువ జంగంపల్లెకు చెందిన ఉపాధి కూలీ సంబెట అమరావతమ్మ(60) శుక్రవారం ఎండను తాళలేక మృతి చెందారు. ఉపాధి పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా భానుడు ప్రతాపానికి తట్టుకోలేక కుప్పకూలిపోయింది. స్థానిక ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించగా, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషయం ఉపాధి హామీ పథకం ఏపీవో మాలిక్‌బాష ధృవీకరించారు.

విత్తన శుద్ధితో వేరుశనగ సంరక్షణ

ఖరీఫ్ ముంచుకొస్తోంది. చిరు జల్లులు రైతుల్లో ఆశలు నింపుతున్నాయి. నేల కాస్త పదునైతే దుక్కులు చేసి... విత్తనం వేసేందుకు రైతన్న సిద్ధమవుతాడు. ఈ నేపథ్యంలో ప్రధానంగా వేరుశనగ పంట సాగు చేసే రైతులు కొన్ని మెలకువలు పాటించాల్సిందేనని నిపుణులు చెబుతున్నారు. సరైన యాజమాన్య పద్ధతులు పాటించకపోతే నష్టపోవాల్సిందేనని హెచ్చరిస్తున్నారు.

- భూసార పరీక్షలు తప్పనిసరి
- లోతైన దుక్కులతో అధిక దిగుబడి


వేరుశెనగ పొలాల్లో లోతైన దుక్కులు చేస్తున్న రైతులు


ట్రేలో ప్రయోగాత్మకంగా విత్తన నమూనాలు


మట్టి నమూనాలు సేకరిస్తున్న అధికారులు

గుర్రంకొండ : అన్నమయ్య జిల్లా పడమటి మండలాల్లో ముఖ్యమైన పంట వేరుశనగ . 50 శాతం మంది రైతులకు వేరుశనగ పంటే ఆధారం. ఖరీఫ్ సీజన్‌లో ఈ పంట సాగు చేసేందుకు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. వేరుశనగ పంట సాగుకు ముందు పొలాల్లో లోతైన దుక్కులు చేయాలని, సాగుకు నెల రోజుల ముందే పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకోవాలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అనంతరం విత్తన కాయల పరీక్ష తప్పనిసరి. చాలా మంది రైతులకు అవగాహన లేకపోవడంతో తగినంత పంట దిగుబడి సాధించలేక నష్టాలపాలవుతున్నారు.

లోతైన దుక్కులు

మేలో తొలకరి వర్షాలకు దుక్కులు చేసే ముందు ఎరువులను పొలాలపై చల్లుతారు. ఆ తరువాత లోతైన దుక్కులు చేపడతారు. తద్వారా పొలంపైనున్న ఎరువులు భూమిలోపల చేసి పంటసాగు ప్రారంభానికి ముందే సారవంతమైన ఎరువుగా మారుతుంది. పంట సాగు చేసే సమయం కంటే ముందు కనీసం రెండు మార్లు పొలాల్లో లోతైన దుక్కులు రైతులు చేస్తుంటారు. తద్వారా పంట సాగు చేసే పొలం ఎంతో సారవంతమవుతుందని రైతుల నమ్మకం.

విత్తన నాణ్యత

వేరుశనగ సాగు చేసే ముందు విత్తనకాయల నాణ్యతను పరీక్షిస్తే మొలకెత్తే శాతం తెలిసిపోతుంది. ఒక ట్రేలో మట్టి, ఇసుక, ఎరువులతో నింపి వంద విత్తన గింజల్ని నాటాల్సి ఉంటుంది. 12 రోజుల అనంతరం మొలకెత్తే శాతాన్ని బట్టి నాణ్యత తెలుస్తుంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం 80 నుంచి 90 శాతం వరకు మొలకెత్తితే నాణ్యమైనదిగా నిర్ధారించవచ్చు.

భూసార పరీక్ష

పొలాల్లో రెండేళ్ల కోమారు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలి. పంట సాగు చేసిన ప్రతిసారీ భూమిలో నత్రజని, భాస్వరం వినియోగం ఎక్కువగా ఉంటుంది. పరీక్షల ద్వారా వాటి శాతం ఎంతమేర తగ్గిందో తెలుసుకోవచ్చు. సాగుకు ముందు పొలంలో తగినంత మేర వాటిని అందించగలిగితే పంట దిగుబడులు సాధించవచ్చు. వ్యవసాయాధికారులే మట్టిని సేకరిస్తారు.

సూక్ష్మపోషకాలు

సూక్ష్మ పోషకాల సమతుల్యత సరిచూసుకుని మందులు వినియోగించాల్సి ఉంటుంది. వేరుశనగ పంట సాగులో బోరాన్, సల్ఫర్ వినియోగిస్తే కాయలు నాణ్యతగా వస్తాయి. జింక్ వినియోగిస్తే వేరుశెనగ మొక్కల్లో కాండం, మొక్క ఎదుగుదల ఎక్కువగా, ధృడంగా ఉంటాయి. కాయల్లో గింజ ఏర్పడే శాతం పెరుగుతుంది. దుక్కులు చేసే సమయంలో 200 కిలోల జిప్సమ్ చల్లితే నూనె శాతం పెరుగుతుంది.

విత్తనశుద్ధి తప్పనిసరి

వేరుశెనగ విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలి. డీఎమ్–45 రకం మందును ఎకరాకు సరిపడే విత్తన గింజల్లో 180 గ్రాములు కలిపి పొలంలో విత్తాలి. తద్వారా గింజల్ని ఆవహించే తినేసే వేరుతొలుచు పురుగులు దూరంగా వెళ్లిపోతాయి. అంతేగాక విత్తనాలు మొలకెత్తే వరకు వాటికి సంరక్షణగా ఉంటాయి. అంతేగాక విత్తనాలు మొలకెత్తే వరకూ వాటిని సంరక్షిస్తాయి.

కలుపుమొక్కల నివారణ

వేరుశెనగ పంట సాగులో కలుపు మొక్కల నివారణా మందులు తప్పనిసరిగా వాడాలి. విత్తనాలు వేసిన రోజు సాయంకాలం, మరుసటి రోజున గానీ మందులు పొలంలో పిచికారీ చేయాలి. ఎకరం పొలానికి ఒకటిన్నర లీటరు పెండా మిథాలిన్ అనే మందును 200 లీటర్ల నీటిలో కలిపి పంట పొలంపై పిచికారీ చేయాలి. విత్తనాలు వేసినప్పటి నుంచి రెండు నెలల పాటు కలుపు మొక్కలు పెరగకుండా చూడవచ్చు.

అంతర పంటలు

వేరుశనగ పంట సాగులో అంతర్ పంటలు సాగు చేయడంతో పంటకు ఎంతో రక్షణగా ఉంటుంది. పొలంలో విత్తన గింజలు వేసే ఆరుసాళ్ల(వరుసలు)కు ఒకసాలు కందులు, అలసందలు వంటి విత్తనాలు వేయాల్సి ఉంటుంది. పొలం చుట్టూ రెండు నుంచి నాలుగు వరసలు జొన్నలు వేయాలి. వీటితో పక్క పొలాల నుంచి వైరస్, ఇతర క్రిమి కీటకాలు, ఎర్రగొంగళి పురుగులు ఆహించకుండా చేయవచ్చు.

విత్తన పరీక్షలతో ప్రయోజనం



వేరుశెనగ విత్తన పరీక్షలు చేయించుకుంటే ప్రయోజనం ఉంటుంది. విత్తనాలు మొలకెత్తే పరీక్షలు తప్పనిసరిగా చేయిస్తే ముందుగా నాణ్యత తెలుస్తుంది. మొలకెత్తే శాతం ఎక్కువగా ఉన్న విత్తన కాయలకే ప్రాధాన్యం ఇవ్వాలి. ఏటా ప్రభుత్వం అన్ని ఆర్బీకేలకు నాణ్యమైన రాయితీ వేరుశెనగ విత్తన కాయల్ని సరఫరా చేస్తుంది. పంట సాగులో మెలకువలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చు.

– రమణ, రైతు, గెరికుంటపల్లె

సరైన యాజమాన్యంతో అధిక దిగుబడులు



వేరుశెనగ పంట సాగులో వ్యవసాయ అధికారుల సూచనలు, మెలకువలు పాటించి సరైన యాజమాన్యం పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు. పొలంలో సేకరించిన మట్టి నమూనాల ఆధారంగా భూసార పరీక్షల్లో వచ్చిన ఫలితాలను బట్టి అధికారులిచ్చే సూచనలు తప్పనిసరిగా పాటించాలి. ఎంత మేరకు ఎరువులు, పురుగు నివారణ మందులు వావాలో తెలుసుకోవాలి.

– ఓబుల్‌రెడ్డి, రైతు, మొరంమీదపల్లె